క్లుప్తంగా

2న నున్నలో శోభాయాత్ర

నున్న(విజయవాడరూరల్): శ్రీయోగీశ్వర్ దేవీ దయాల్ మహాదేవ్ జ్యోతిర్లింగ దేవస్థానం 22వ వార్షికోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 2వ తేదీన నున్న గ్రామంలో శోభాయాత్ర నిర్వహి స్తున్నట్లు దేవస్థానం నున్న ప్రతినిధి గుంటక విజయభాస్కరరెడ్డి బుధవారం ఒక ప్రక టనలో తెలిపారు. వసంత పంచమి సందర్భం గా దేవస్థానంలో అభిషేకాలు, కలశ పూజతో పాటు పంచముఖ హనుమాన్ అభిషేకం జరు గుతాయన్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

గోపవరపుగూడెంలో పశు వైద్యశిబిరం

గన్నవరంరూరల్: ప్రభుత్వం పశు పోషకుల వద్దకే వచ్చి పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్నట్లు గొల్లనపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ బి.రెడ్డెమ్మ అన్నారు. గోపవరపుగూడెంలో బుధవారం పశు వైద్యశి బిరాన్ని నిర్వహించారు. ఉచితంగా మం దులను అందజేశారు. 16 గేదెలకు జనరల్, 25 గేదెలకు గైనిక్ పరీక్షలు చేశారు. 32 దూడలకు ఏలిక పాముల మందులు, 51 గేదెలకు, 100 గొర్రెలకు, మేలకు నట్టల నివారణ మందులు, 200 కోళ్లకు యాంటిబయోటిక్ పౌడర్ వేశారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు వేమూరి రవి, నల్లూరు కోటేశ్వరరావు, మండవ లక్ష్మి, నల్లూరు వెంకటరత్నం, ఎల్ఎస్ఏ జి.సౌజన్య, జి.శ్రీనివాసరావు, కె.మంజూష పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ విజేతకు అభినందన



పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీ రింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో ఎం సీఏ చదువుతున్న సాయిసుబ్రహ్మణ్యం బం గారు పతకం సాధించారని ఫిజికల్ డైరెక్టర్ పోతిన రఘు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ.. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగిన ఆల్ ఇండియా సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలో సాయి సుబ్రహ్మణ్యం ఉత్తమ ప్రతిభ చాటి బంగారు పతకం సాధించారన్నారు. ఈ మేరకు కాలేజీలో జరిగిన కార్యక్రమంలో వీసీ పి.వెం కటేశ్వరరావు, డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు

గన్నవరం: అంకితభావంతో పనిచేసే ఉద్యోగు లకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంఈ ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు దేవరపల్లి ఏసు బాబు తెలిపారు. మండలంలోని దావాజిగూ డెంలో బుధవారం ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు, రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు అందు కున్న ఎలీషా దేవసహాయంను ఘనంగా సత్కరించారు. ఏసుబాబు మాట్లాడుతూ.. శాఖ పరంగా ఉత్తమ పనితీరు కనబర్చిన విక్టర్ బాబు, ఎలీషా సేవలను ప్రభుత్వం గుర్తించి అవార్డులతో సత్కరించడం హర్షణీయమ న్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వం, ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ సం ఘాల నేతలు మంద వేణుబాబు, కోటా కృష్ణ మోహన్, తిరివీధి కృష్ణబాబు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



కంకిపాడు: వాహనదారులు హెల్మెట్ ధరించ టం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని సీఐ జె.మురళీకృష్ణ అన్నారు. కంకిపాడు సర్కిల్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ బుధవారం కంకిపాడులో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచే సిన సదస్సులో సీఐ మాట్లాడుతూ.. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించామన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎస్ఐలు డి.సందీప్, అద నపు ఎస్ఐ తాతాచార్యులు, సురేష్‌బాబు(ఉ య్యూరు), పలువురు సిబ్బంది, మహిళా సంర క్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలకు గుడ్‌బై'

రామవరప్పాడు: జనసేన గన్నవరం నియోజక వర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, నిజమని నిరూపిస్తే రాజకీయాలకు గుడ్‌బై చెబుతానని టీడీపీ నేత కోనేరు సందీప్ అన్నారు. ఎనికేపా డులో విగ్రహాల ఏర్పాటు విషయంలో జరిగిన గొడవ నేపథ్యంలో రమేష్‌బాబు చేసిన ఆరోప ణలను బుధవారం కోనేరు సందీప్ విలేకరుల సమావేశంలో ఖండించారు. సందీప్ మాట్లా డుతూ గాంధీ, రంగా విగ్రహాల ఏర్పాటుకు తాము అడ్డుకాదన్నారు. వీటితో పాటు జన సేన, టీడీపీ నాయకులు కోరినట్లుగా జ్యోతి రావు పూలే విగ్రహన్ని కూడా ఏర్పాటు చేయమని అడిగామన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ లను ఆహ్వానించి ఘనంగా విగ్రహాల ఆవిష్క రణ నిర్వహించుకుందామని చెప్పామన్నారు. దీనికి విరుద్ధంగా దొంగచాటుగా విగ్రహాలను ఆవిష్కరించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నిం చామన్నారు. రెండు విగ్రహాలకు అనుమతులు లేవని ఒక విగ్రహానికి మాత్రమే అనుమతులు ఉన్నాయని ఇదే విషయాన్ని పంచాయతీ కార్య దర్శి అడిగితే త్రీవ స్థాయిలో దూషించార న్నారు. కావాలనే గొడవలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అన్నదాతల గోడు పట్టదా ?

- మంతెన వద్ద బుడమేరుపై బ్రిడ్జి నిర్మాణం గాలికి
- ప్రతిపాదనలకే పరిమితమైన బ్రిడ్జి నిర్మాణం
- పంటల సాగుకు అవస్థలు పడుతున్న రైతులు
- బ్రిడ్జి నిర్మాణంతోనే శాశ్వత పరిష్కారం



బుడమేరు వరదలకు మంతెన వద్ద కూలిన బ్రిడ్జి

కంకిపాడు: అన్నదాతల పట్ల కూటమి ప్రభుత్వం అడుగడుగునా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి. అవాంతరాలను అధిగమిస్తూ సాగులో నిమగ్నమవుతున్నా తమ కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక వ్యయప్ర యాసలకోర్చి సాగు చేస్తున్నామంటున్నారు. పం ట పొలాలకు వెళ్లేందుకు వినియోగించే బ్రిడ్జి వర దల కారణంగా 2023 జూలైలో కూలిపోయింది. నేటికీ బ్రిడ్జి నిర్మాణంపై స్పష్టత లేకపోవటంతో అన్నదాతల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

కూలిన బ్రిడ్జికి మోక్షమేదీ ?

బుడమేరుపై మంతెన గ్రామం వద్ద బ్రిడ్జి ఉంది. బుడమేరు పరిధిలో ఈ బ్రిడ్జి మీదుగా గన్నవరం మండలం కేసరపల్లి, ఉంగుటూరు మండలం తరిగొప్పల, అజ్జంపూడి, కంకిపాడు మండలం మంతెన, తెన్నేరు గ్రామాల పరిధిలో సాగులో ఉన్న 1,200 ఎకరాల పంట భూములకు రైతాం గం రాకపోకలు సాగిస్తుంది. ప్రధానంగా వరి, చెరకు, మినుము, అక్కడక్కడా కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాల పరిధిలోని పంట పొలాలకు వెళ్లేందుకు ఈ బ్రిడ్జి ఒక్కటే ప్రధాన రహదారి మార్గం.

అయితే 2023 జూలైలో బుడమేరుకు వచ్చిన వర దలు, భారీ వర్షాలతో బ్రిడ్జి ధ్వంసమై కూలింది. అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణ పనులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయించింది. రూ.2.50 కోట్ల వ్యయంతో బ్రిడ్జిని నిర్మించి రాకపోకలు పునరుద్ధరించేందుకు డ్రెయినేజీ విభాగం అధికారులు చర్యలు తీసుకు న్నారు. ఈ క్రమంలో రాజకీయ పరిణామాలు, ఎన్నికల నేపథ్యంలో బ్రిడ్జి నిర్మాణం కొలిక్కిరా లేదు.

రూ.15 కోట్లకు చేరిన అంచనా..

తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభు త్వంలో భారీ వర్షాలు, వరదలతో సమస్య మరిం త జఠిలమైంది. వరుస వర్షాలు, వరదలతో బ్రిడ్జి నిర్మాణంపై మరో మారు అంచనాలను సేకరిం చారు. మంతెన ఇవతలి కట్ట నుంచి అవతలి కట్ట వరకూ ఒకే బ్రిడ్జి ఉండేలా అంచనాలను తయారు చేశారు. బ్రిడ్జి నిర్మాణ అంచనా వ్యయంతో రూ.15 కోట్లకు చేరింది. అయితే ప్రభుత్వం నుంచి నేటికీ ఆమోదం లభించలేదు.

రైతుల పాట్లు..

రైతులు తాము సాగు చేస్తున్న పంట పొలాల్లోకి వెళ్లేందుకు సైతం అవస్థలు ఎదుర్కొంటున్నారు. కాలినడకన వెళ్లటం తప్ప, వాహనాల్లో పొలా లకు అవసరమైన కూలీలు, ఎరువులు, వ్యవ సాయ యంత్ర పరికరాల తరలింపునకు వ్యయ ప్రయాసలకోర్చాల్సి వస్తోంది. ఎకరాకు పై ఖర్చులు రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకూ అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఉప్ప లూరు, తెన్నేరు మార్గాల గుండా పొలాలకు చేరు కోవాల్సి రావటంతో ప్రయాణ భారం సాగు ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయని అన్న దాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై డ్రెయినేజీ విభాగం ఏఈ శ్రీనివా సమూర్తిని సాక్షి వివరణ కోరగా రూ.15 కోట్లతో అంచనాలు రూపొందించామని, ప్రభుత్వం నుం చి అనుమతి రాగానే పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది..



కేసరపల్లి శివారున ఉన్న పదెకరాల భూమి కౌలు చేస్తు న్నాను. పొలానికి వెళ్లటానికి ఈ బ్రిడ్జి ఒక్కటే ఆధారం. అది కూలిపోవటంతో ఉప్పలూరు డొంక మార్గం గుండా చేరుకోవాల్సి వస్తుంది. ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు అదనంగా ఖర్చు అవుతుంది.

– కొండేటి సుబ్బారావు, కౌలురైతు, మంతెన

బ్రిడ్జిని నిర్మించాలి..



ఈ బ్రిడ్జి మీదుగా ఐదారు గ్రామాల పరిధిలోని భూములకు వెళ్తున్నాం. ప్రస్తుతం అది కూలటంతో రాకపోకలకు ఇబ్బంది అవుతుంది. రైతుల ఇబ్బం దులను దృష్టిలో ఉంచుకుని బ్రిడ్జి నిర్మాణంపై వెంటనే చర్యలు తీసుకో వాలి. అప్పుడే సాగు సజావుగా సాగుతుంది.

– చిమటా పూర్ణచంద్రరావు, రైతు, మంతెన

4 నుంచి డొమిస్టిక్ డేటా ఎంట్రీలో శిక్షణ

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశా లలోని స్కిల్‌హబ్‌లో ఫిబ్రవరి 4వ తేదీ నుంచి డొమిస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి బుధ వారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇం టర్మీడియెట్, డిగ్రీ చదివిన జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులుగా పేర్కొన్నారు. నూతన సాంకేతికతను ఉపయోగించి నిపుణులైన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వడంతో పాటు స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 94940 05725, 88851 59008 నంబర్లలో సంప్ర దించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాల యంలో గురువారం ఉదయం 10 గంటలకు సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.స్వర్ణలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొమ్మరాజు సుధీర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో పథకాల అమలు, ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తార న్నారు. మండల పరిషత్ సభ్యులు, ప్రజాప్రతి నిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజ రుకావాలని ఆమె కోరారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆల యంలో అమావాస్యను పురస్కరించుకుని బుధవారం భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహిం చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హోమ గుండం వద్ద అర్చకులు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పాడి, పంటలతో చల్లగా ఉండాలని ఆకాంక్షిస్తూ హోమం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా

కంకిపాడు: నియోజకవర్గ ప్రజలకు అండగా ఉం టానని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. మండ లంలోని ప్రొద్దుటూరు గ్రామ శివారు కొణతన పాడు గ్రామంలో ఇటీవల మృతి చెందిన చిన్నారి కొడాలి నిత్య(6) కుటుంబాన్ని బుధవారం రాత్రి చక్రవర్తి, వైఎస్సార్ సీపీ శ్రేణులు పరామర్శిం చాయి. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారి నిత్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి తన వంతుగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. చక్రవర్తి మాట్లాడు తూ.. నియోజకవర్గంలో ఏ వర్గానికి ఆపద వచ్చినా అండగా నిలుస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు శ్రేణులు సమర్థంగా పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్ర మంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు భీమవరపు నాగి రెడ్డి, స్థానిక నాయకులు బీహెచ్ రాజగోపాల్‌రెడ్డి, వార్డు సభ్యురాలు ప్రొద్దుటూరు నాగమణి, బొట్ట తిమ్మారెడ్డి, భీమవరపు లక్ష్మణరెడ్డి, బొట్ట వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారి కుటుంబాన్ని పరామర్శిస్తున్న దేవభక్తుని చక్రవర్తి, నాయకులు

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

గన్నవరం: చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరం గా ఉండాలని గన్నవరం సీఐ బీవీ శివప్రసాద్ తెలిపారు. మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి మనిషి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమై నదన్నారు. ఈ దశలో మాదక ద్రవ్యాలకు బానిసైతే జీవితం సర్వనాశనం అవుతుందన్నారు. వీటికి దూరంగా క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని చెప్పారు. డ్రగ్స్ విక్రయదారులు కళాశాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మాదక ద్రవ్యాలను అలవాటు చేసి డబ్బు సంపాదిస్తున్నారన్నారు. సమాజానికి హాని చేసే ఈ తరహా వ్యక్తుల వివరాలను పోలీసు లకు తెలియజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. డ్రగ్స్‌ను సేవించినా, విక్రయించినా చట్ట రీత్యా నేరామన్నారు. సోషల్ మీడియా, సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శివప్రసాద్

పరాకాష్టకు చేరిన పోలీసుల వేధింపులు


గన్నవరం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణు లపై పోలీసుల వేధింపులు పరాకాష్టకు చేరుకు న్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి పార్టీ నేతలతో పాటు వారి కుటుంబ సభ్యులను కూడా ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత కేసులను తిరగతోడి వందలాది మంది వైఎస్సార్ సీపీ శ్రేణులను నిందితులుగా చేర్చారు. ఇప్పటికే ఈ కేసుల్లో అనేక మందిని అరెస్ట్ చేసి జైలుకు కూడా పంపించారు. మిగిలిన వారిని కూడా ఏదో విధంగా అరెస్టులు చేసేందుకు పోలీసులు వారి కుటుంబ సభ్యులను కూడా అదుపులోకి తీసుకో వడం వివాదస్పదమైంది. రెండేళ్ల క్రితం టీడీపీ ఆఫీస్‌పై జరిగిన దాడి కేసులో పోలీసులు 94 మం ది వైఎస్సార్ సీపీ శ్రేణులను నిందితులుగా చేర్చారు. వీరిలో 45 మందిని పోలీసులు, సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ముం దస్తు బెయిల్ కోసం మిగిలిన వారు దాఖలు చేసిన పిటిషన్‌ను ఇటీవల హైకోర్టు డిస్మిస్ చేయడంతో వారి కోసం గాలింపును ముమ్మరం చేసింది. దీనిలో భాగంగా బుధవారం తెల్లవారుజాము నుంచి సదరు నేతల ఇళ్లకు వెళ్లిన పోలీస్ బృందాలు తని ఖీలు జరిపారు. సదరు నేతలు ఎవరూ ఇళ్ల వద్ద లేకపోవడంతో చివరికి పార్టీ మండల కన్వీనర్ కైలే శివకుమార్ కుమారుడు కైలే రాజగోపాల్, బుద్ద వరం ఉప సర్పంచ్ వేల్పూరి బసవరావు కుమా రుడు దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని గన్న వరం పీఎస్‌కు తరలించారు.

కుంచనపల్లి సిట్ ఆఫీస్‌కు..

అనంతరం ఇదే కేసులో పట్టుబడిన బాపులపాడుకు చెందిన కలపాల అభిరామ్‌తో పాటు రాజగోపాల్, దుర్గాప్రసాద్‌ను సీఐడీ అధికారులు తమ అధీనం లోకి తీసుకువెళ్లి కుంచనపల్లి సిట్ ఆఫీస్‌కు తీసుకు వెళ్లారు. సుమారు రెండు గంటల పాటు ఇరువురిని విచారించిన సీఐడీ అధికారులు పరారీలో ఉన్న కుటుంబ సభ్యుల వివరాలను తెలియజేయాలని గట్టిగా ఒత్తిడి చేశారు. ఇంతలో రాజగోపాల్, దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు, బంధువులు సీట్ కార్యాలయానికి చేరుకుని వారి అక్రమ నిర్బంధం పై ప్రశ్నించారు. ఇటీవల డిగ్రీ పూర్తి చేసిన కైలే రాజ గోపాల్ సివిల్ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు హైద రాబాద్‌లో కోచింగ్ తీసుకుంటున్నాడు. సంక్రాంతి సెలవులు నిమిత్తం స్వగ్రామానికి వచ్చిన అతడు మరో రెండు రోజుల్లో తిరిగి వెళ్లే క్రమంలో సీఐడీ అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనతో తీవ్ర భయాందోళనకు గురైన రాజగోపాల్ పోలీసులు, సీఐడీ అధికారులు వ్యవహరించిన తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి వారి నుంచి ఎటువంటి సమాచారం రాకపోవడంతో సాయం త్రం 4.30 గంటలకు ఇద్దరిని వారి బంధువుల వ్యక్తి గత పూచికత్తుపై ఇళ్లకు పంపించివేశారు. అయితే వైఎస్సార్ సీపీ శ్రేణులపై పోలీసులు సాగిస్తున్న ఈ తరహా వేధింపు చర్యలను పలువురు తీవ్రంగా ఖం డించారు.

వైభవంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం

ఉంగుటూరు: ఇందుపల్లిలోని షిర్డీ సాయిబాబా విఘ్నేశ్వర, దత్తాత్రేయ స్వామి వార్ల ఆలయ 24వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహిం చారు. ఉదయం 5.30 గంటలకు విఘ్నేశ్వరస్వామి పూజ, పుణ్యాహవాచనం 100 లీటర్ల క్షీరాభిషేకం చేశారు. వేద పండితులు విశేష పూజా, భజన కార్య క్రమాలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బాబాను దర్శి చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఎమ్మెల్యేను సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఉయ్యూరు మురళీ, కార్యనిర్వాహక కార్య దర్శి వక్కలగడ్డ పర్యవేక్షణలో భారీ అన్నసంతర్పణ జరిగింది. సాయంత్రం 3 గంటలకు భాజ భజంత్రీ లతో గ్రామ వీధులలో స్వామి వారి ఊరేగింపు ఘనంగా జరిగింది.



కంకిపాడులో యువకుడు వీరంగం

కంకిపాడు: మద్యం మత్తులో ఓ యువకుడు వీరంగం వేసిన ఘటన కంకిపాడులో బుధవారం తెల్లవారుజా మున చోటుచేసుకుంది. స్థానికులు ఆ యువకుడుని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సేకరించిన వివరాల మేరకు.. పట్టణంలోని విజయలక్ష్మి సినిమా హాల్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఓ యువకుడు ఓ ఇంటిలోని గేట్లు కొడుతూ.. చంపే స్తానంటూ బెదిరిస్తూ పెద్దగా కేకలు వేస్తున్నాడు. స్థానికులు ఒక్కసారిగా భీతిల్లారు. ఓ మహిళ స్పం దించి ఆ యువకుడి కళ్లల్లో కారం చల్లి అతికష్టం మీద పట్టుకుని పోలీసులకు అప్పగించింది. పోలీసులు ఘటనాస్థలంలో విచారించి, ఆ యువకుడిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయితే మతిస్థిమితం లేని ఈడుపుగల్లు వాసిగా గుర్తించి కుటుంబ సభ్యు లకు అప్పగించటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.


యనమలకుదురులో దాడి.. కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురులో ఓ కుటుంబంపై పలువురు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం యనమల కుదురుకు చెందిన శీలం శ్రీను పామర్రులో సోమవారం దినం కార్యక్రమానికి వెళ్లాడు. అక్కడ శీలం సుబ్బారావు, శీలం దుర్గారావు, సాంబయ్య, మరి కొందరు శ్రీనుతో గొడవ పడి దాడి చేశారు. పెద్దలు వివాదం జరగకుండా ఆపి అందరినీ నచ్చ చెప్పి పంపారు. కాగా మంగళవారం ఫిర్యాది అల్లుడు సముద్రయ్య యనమలకుదురులో శ్రీను ఇంటికి వస్తుండగా లాకుల వద్ద దారికాచిన శీలం సుబ్బా రావు, శీలం దుర్గారావు, సాంబయ్య, మరి కొందరు సముద్రయ్యపై దాడి చేశారు. సమాచారం తెలుసు కున్న శ్రీను అతని కుటుంబ సభ్యులు ఘటనా స్థలం వద్దకు వెళ్లగా వీరిపై కూడా దాడి చేశారు. ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో దాడి చేసిన వారిపై కేసు నమోదు చేశారు.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్ట్

పెనమలూరు: ఆటోలో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పెనమలూరు ఎస్ఐ రమేష్ తెలిపిన వివ రాల ప్రకారం కానూరు కామయ్యతోపులో పోలీ సులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఆటోలో వచ్చారు. వారు పోలీసులను చూసి కంగారు పడి పారిపోతుండగా పోలీసులు ఆటోను ఆపారు. ఆటోలో గుంటూరు జిల్లా తాడేపల్లికి చెం దిన కె.మణికంఠ, విజయవాడ వన్‌టౌన్‌కు చెందిన గుర్రం ఏడుకొండలు, కానూరు సనత్‌నగర్‌కు చెం దిన కర్ణం వాసులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తనిఖీ చేయగా వారి వద్ద 700 గ్రాముల గంజాయి ప్యాకెట్ ఉండటంతో స్వాధీనం చేసుకు న్నారు. నిందితులు రాయగడ నుంచి గంజాయి తీసుకు వచ్చి చిన్న ప్యాకెట్లుగా కట్టి విక్రయిస్తున్నట్లు పోలీసులకు తెలిపారు. కానూరు వీఆర్వోలు ఎం.అ న్నపూర్ణ, గోనెల మంగరాజు సమక్షంలో పంచనామా రాసి నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

బయో గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుపై అవగాహన



హనుమాన్‌జంక్షన్‌రూరల్: పశువుల మల వ్యర్థాలతో బయో గ్యాస్ ఉత్పత్తి ద్వారా పాడిరైతులు వంట గ్యాస్‌ను వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. స్థానిక కాకాని భవన్‌లో అరుకా క్యాపిటల్(సింగపూర్), సిస్టమ్ బయో(పూణే) కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న 'ప్రాజెక్టు ఒయాసిస్– కార్బన్ క్రెడిట్ ప్రోగ్రామ్'లో భాగంగా పాడిరైతు లకు బయో గ్యాస్ వినియోగంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహిం చారు. రోజుకూ 40 కిలోల పశువుల పేడ, 80 లీటర్ల నీటి ద్వారా బయో గ్యాస్ ప్లాంట్ నుంచి నాలుగు గంటల పాటు వంట గ్యాస్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ ప్లాంట్ పూర్తి ధర రూ.50 వేలు కాగా, కృష్ణా మిల్క్ యూనియన్ ద్వారా 10 శాతం రాయితీపై పాడిరైతులకు పంపిణీ చేస్తున్నట్లు చలసాని చెప్పారు. అరుకా క్యాపిటల్, సిస్టమ్ బయో కంపెనీల ప్రతినిధులు, కృష్ణా మిల్క్ యూనియన్ ఏజీఎం చల్లా అన్వేష్ కుమార్, క్లస్టర్ మేనేజర్ మాగంటి హరిబాబు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరం

పాయకాపురం(విజయవాడరూరల్): నేరాల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవస రమని ట్రైనీ ఐపీఎస్ అధికారి మౌనిక అన్నారు. నున్న పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సురక్ష కమిటీ సమావేశం జరిగింది. ట్రైనీ ఐపీఎస్ మౌనిక మాట్లాడుతూ సమాజంలో పోలీసు కమ్యూనిటీ పెరగాలని, అందుకు పోలీసు అధికారులకు ప్రజ లకు మధ్య వారధిగా సురక్ష కమిటీ సభ్యులు ఉం డాలన్నారు. పోక్సో చట్టం పట్ల ప్రజల్లో అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఉందని, చిన్నారులపై అఘాత్యాలు జరగకుండా ఉండేందుకు బ్యాడ్ - గుడ్ టచ్ గురించి పిల్లలకు తెలియజేయాలని అం దులో తల్లిదండ్రులు కూడా బాధ్యతగా వ్యవహరిం చాలని సూచించారు. గంజాయి విక్రయాలు జరగ కుండా చూడాలని, గంజాయి లభించే సమాచారం ఎప్పటికప్పుడు పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమ త్తంగా ఉండే విధంగా అవగాహన కల్పించాలని, బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. ఏసీపీ డాక్టర్ స్రవంతిరాయ్ మాట్లాడుతూ సురక్ష కమిటీ సభ్యులు సమాజానికి ఉపయోగపడే విధం గా పనిచేయాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళాలు సేకరించే విషయంపై మాట్లాడారు. ద్వి చక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరిం చాలన్నారు. నున్న సీఐ పి.కృష్ణమోహన్, ఎస్ఐలు నాగేశ్వరరావు, పండుదొర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి మౌనిక

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి

విజయవాడరూరల్: పి.నైనవరం గ్రామంలోని పేద లకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ బి.సుగుణకు వినతి పత్రం అందజేశారు. అర్హులైన పేదలు 286 కుటుంబాలు ఉన్నాయని వారు తెలిపారు. ప్రభుత్వ భూముల లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఇళ్ల స్థలాల కేటాయింపు జరుగుతుందని తహసీ ల్దార్ చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ పి.నైన వరం గ్రామంలో ప్రభుత్వ భూములున్నాయని అధి కారులు వివిధ కారణాలతో ఆ భూములు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓఎంఎస్ 23 ప్రకారం మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో కళావతి, జమున, విజయమ్మ, రమణ, కనకమహాలక్ష్మి, దావు శ్రీనివాసరావు, బాజీ, చిన్నసట్టు శ్రీనివాసరావు, సురేష్‌బాబు, సీపీఎం నాయకుడు మాతంగి ఆంజనేయులు ఉన్నారు.



తహసీల్దార్ సుగుణకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అందరి సహకారంతో మాదక ద్రవ్యాల నిర్మూలన

పెనమలూరు: అందరి సహకారంతో మాదక ద్రవ్యాల నిర్మూలన సాధించగలమని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు అన్నారు. కానూరు సెక్టార్‌లో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు మాదక ద్రవ్యాల నిర్మూ లన, సోషల్ మీడియా దుర్వినియోగం అనే అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. మాదక ద్రవ్యాల నియంత్ర ణకు ఉద్యమించాలన్నారు. యువత ఉజ్వల భవి ష్యత్తు నాశనం కాకుండా అందరూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో మంచితో పాటు చెడును గుర్తించాలన్నారు. సోషల్ మీడియాకు బానిసైన వారు మానసికంగా ఇబ్బం దులు పడతారన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, సైబర్ సం బంధాలు, జూదం, లైంగిక వ్యసనాలు సోషల్ మీడియా వలనే జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.విజ యలక్ష్మి, నీ తోడు సంస్థ ప్రతినిధులు జె.జ్యోతిచం ద్రిక, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న శేఖర్‌బాబు

యోగా శక్తి చికిత్సలో శిక్షణ

పెనమలూరు: యోగా శక్తి చికిత్సతో పాటు చికి త్సపై ప్రత్యేక శిక్షణ ఇస్తామని యోగాశక్తి సాధన సమితి చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలి పారు. ఫిబ్రవరి 8 నుంచి 14వ తేదీ వరకు కానూరు అశోక్‌నగర్‌లో ఇండియన్ ఓం కార్యాలయంలో యోగా శక్తి శిక్షణ, చికిత్స ఇస్తామన్నారు. నాడీ పరీక్ష ద్వారా మూల సమస్య నిర్ధారించటం, ప్రాణ శక్తి పెంచటం, దేహంలో అవయవాలన్నీ పని చేసే విధంగా చికిత్స చేస్తామన్నారు. వివరాలకు 90003 47369 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com